# జ్ఞానోదయం

శ్రీనివాసరావు రాజవరం తాసిలుదారు. క్లార్కుగా చేరితే రెవెన్యూ డిపార్టుమెంటులో కలక్టరు అవ్వచ్చని క్లార్కుగా చేరాడు. కష్టపడి పైకి వచ్చాడు. కలక్టరు కాకపోయినా తాసిలుదారు అయ్యాడు.

రెవెన్యూ డిపార్టుమెంటు అంటే అందరికీ లోకువ. అందులో వాళ్ళందరూ లంచగొండులు అనేస్తారు. పబ్లిక్‌తో సంబంధం ఉన్న ప్రతిసంస్థా అంతే అంటారు.

లంచం అన్నదానికి అర్థం మారిపోయింది. పని కావాలంటే తృణమో ఫణమో ముట్టచెప్పాలిసిందే. కాగితాల మీద పనులు జరిగే రోజులు పోయాయి. కాగితంతోపాటు వెనుక మనిషి ఉండాలి. ఆ మనిషి ఎవరికి ముట్టచెప్పవలిసి ది, వాళ్ళకి ముట్టచెప్పాలి. అలా ముట్టచెప్పే వాళ్ళు ముట్టచెప్పించుకునేవాళ్ళు లంచం ఇస్తున్నామని పుచ్చుకుంటున్నామని అనుకోరు. చెడు అలవాటయితే చెడుగా అనిపించదు. దానికి ఇదే నిదర్శనం.

కాని శ్రీనివాసరావు నలుగురిలాంటి వాడుకాడు. అసలు ఆ డిపార్టుమెంటులో వుండవలసినవాడు కాడు. ఉన్నందుకు కొంచెం చిక్కుగానే ఉంది. అయినా అతడి నిజాయితీ అతడికి దెబ్బ తగలకుండా చూచుకుంటున్నాడు. అందుకే చచ్చీచెడి తాసిల్దారు అయ్యాడు.

అప్పటికి అతడి బాధ్యతలు పెరిగాయి. భార్య లక్ష్మీదేవి ఉత్తమురాలు. ఏదో గడ్డితిని భర్త సంపాదించాలన్న ఆశ ఆమెకులేదు. సుఖంగా జీవితం గడిచిపోతే చాలు అనుకుంటుంది.

శ్రీనివాసరావుకు ముగ్గురు మగపిల్లలు. అంతా మిడిల్‌స్కూల్, హైస్కూల్ చదువులలో ఉన్నారు. అతడు పిల్లలను చూచి మురిసిపోతాడు. డబ్బు సంపాదించి లక్షలు పిల్లలకు ఇద్దామన్న ఉద్దేశ్యం అతడికి లేదు. వాళ్ళకు చదువుచెప్పించి ప్రయోజకులను చేస్తే చాలు. డబ్బు ఇవ్వలేనిది చేయలేనిది చదువు చేస్తుందని అతడి విశ్వాసం. అందుకే పిల్లల చదువుమీద శ్రద్ధ తీసుకుంటాడు.

*డి. వి. యస్. ఆర్. మూర్తి*

అతడిది మెత్తని హృదయం. జాలి గుండె. ఎవరైనా కష్టాలలో ఉంటే ఆదుకొనే తత్వం. లక్ష్మీదేవిని, పిల్లలను పువ్వులలో పెట్టినట్లు చూచుకుంటాడు. ఈగ వాలనీయడు. అతడు కష్టపడైనా వాళ్ళని సుఖపెడతాడు. నా లాభం, నా మంచి, నా సుఖం అనుకునే ఈ రోజుల్లో శ్రీనివాసరావు మసిబొగ్గులలో మాణిక్యం.

అతడికి ఒక్కతే చెల్లెలు. పేరు శారద. ఆమె భర్త రామారావు ఏదో కంపెనీలో చిన్న గుమాస్తా. ఏదో కాలం గడుపుతున్నాడు. ఆమెకు ఒక ఆడపిల్ల ఒక మగపిల్లవాడు. ఏదో వాళ్ళ పొట్ట వాళ్ళు పోసుకొంటున్నారని శ్రీనివాసరావు సంతోషిస్తూ వచ్చాడు!

ఏ క్షణాన ఏమి జరుగుతుందో ఎవరికి తెలుసు! ప్రపంచం ఒక మాయ. జీవితం ఒక లీల.

ఒకరోజు ఉదయం శారద దగ్గర్నుంచి టెలిగ్రాం వచ్చింది. ఆమె భర్తకు ప్రమాదంగా ఉందని, వెంటనే బయలుదేరి రమ్మని అందులో ఉంది.

ఆ వార్త శ్రీనివాసరావుకు నెత్తిన పిడుగు పడినట్లు అయింది. ఏదో ప్రమాదం జరిగిపోయినట్లే భావించాడు. మానవుని మనస్సు చెడే ఆలోచిస్తుంది. అది సహజం.

హడావుడిగా బయలుదేరి ఉన్నవాడు ఉన్నట్టుగ రాజమండ్రీ చేరాడు శ్రీనివాసరావు. అతడు అనుకున్నంత పనీ అయింది. అతడి బావగారు రామారావు ఇకలేడు. అక్కడి దృశ్యం చూచి అతడు నిలువునా నీరైపోయాడు.


'అన్నయ్యా నన్ను అన్యాయంచేసి ఆయన వెళ్ళిపోయారు' అంటూ శారద భర్త శవంమీదపడి ఏడుస్తోంది. ఆమెను చూస్తే ఎవరి గుండైనా కరిగిపోయేలా ఉంది. శ్రీనివాసరావు మాట వేరే చెప్పనక్కరలేదు.

'ఊరుకో శారదా. మనం మానవులం. దేవుడు చేసినదానికి మనం ఏం చేయగలం? ఇప్పుడే ధైర్యంగా ఉండాలి' అంటూనే శ్రీనివాసరావు ఏడ్చాడు. చెల్లెలిని ఓదార్చాలి కనుక అతడు ఆ మాటలు అనలేక అన్నాడు.

రామారావు చనిపోవటం నిజానికి శారదకంటే శ్రీనివాసరావుకే ఎక్కువ బాధగా ఉంది. వాళ్ళ బాధ్యత ఇప్పుడు అతడిమీద పడుతుంది. అతడి సంసారంతోపాటు చెల్లెలి సంసారం అతడే చూడాలి. ఆ బాధ్యత నెత్తిన పెట్టుకోవడానికి అతడికి పెద్ద బాధగాలేదు. చెల్లెలి పచ్చని సంసారం చితికిపోయిందనే అతడికి ఎక్కువ విచారం.

'నేను ఏం పాపం చేశానో నాకు ఈ విపత్తు వచ్చిపడింది. దేవుడా నేనేమి పాపంచేశాను' అంటూ శారద తల బాదుకుంది. శ్రీనివాసరావు ఏడుస్తూనే వెళ్ళి ఆమెను ఓదార్చాడు.

యువ



'చచ్చిపోయిన వాళ్ళతో పోతామా చెల్లీ, నేను ఉన్నానుగా. నీవు బాధ పడకు' అన్నాడు శ్రీనివాసరావు. ఆమెను అతడు ఓదార్చే విధానంచూస్తే అతడి లాంటి అన్నలుండడం ఎవరికైనా అదృష్టం అనిపిస్తుంది.

శ్రీనివాసరావు దగ్గరవుండి మిగిలిన కార్యక్రమాలన్నీ యథావిధిగా నెరవేర్పించాడు. కంపెనీ డైరెక్టరుతో అతడు మాట్లాడాడు. రామారావుకు రావలసిన డబ్బు అంతా తీసుకున్నాడు. మొత్తం అయిదువేల రూపాయలు కంపెనీవాళ్ళు శారదకు ఇచ్చారు.

'అన్నయ్యా! ఈ డబ్బు నీ దగ్గర ఉంచు. నీవు తప్ప నా కింకెవరూ లేరు' అంటూ శారద కళ్ళనీళ్ళు పెట్టుకుంది. శ్రీనివాసరావు గుండె ద్రవించింది.

'ఈ డబ్బు నీదగ్గరే ఉంచుకో. నాకు వద్దమ్మా' అన్నాడు శ్రీనివాసరావు.

'మీ బావగారే పోయిన తరువాత ఈ డబ్బు నన్ను కాపాడుతుందా అన్నయ్యా. నీ దగ్గర ఉంచు' అంటూ ఆ డబ్బు ఆమె శ్రీనివాసరావు చేతిలో పెట్టింది.

'ఈ డబ్బు నాకు అక్కరలేదు చెల్లీ. మీరు నాతో వచ్చెయ్యండి. నాతోపాటే మీరూను. అందరం కలిసే ఉందాము' అన్నాడు శ్రీనివాసరావు. డబ్బుకంటే అతడికి చెల్లెలిమీద ప్రేమ ఎక్కువ ఉంది. అతడి మాటలలో అది స్పష్టంగా కాన వచ్చింది.

'నీవు డబ్బు తీసికోకపోతే నేను ఎలా రాను నీతో చెప్పు అన్నయ్యా? నీవు తీసికుంటేనే నీతో వస్తాను. నన్ను నీవు అర్థం చేసుకున్నది ఇంతేనన్నమాట. నీ చెల్లెలికి నీమీద నమ్మకం ఉంది' అంది శారద.

శ్రీనివాసరావుకు ఆమె డబ్బు తీసు కోవడం తప్పలేదు. చెల్లెలి మనస్సు కష్టపెట్టటం అతడికి నచ్చలేదు. ఆమె బాధ్యత, ఆమె పిల్లల బాధ్యత అంతా అతడిదే. ఆ అయిదువేలతో అయ్యేది ఏమీలేదు. ఆమెనూ, పిల్లలనూ పోషిస్తూ ఆమె పిల్లలని పైకి తీసుకొని రావాలి. అప్పుడే అతడిధర్మం అతడు నెరవేర్చు కున్నట్లు.

* * *

శ్రీనివాసరావు రెవెన్యూ డిపార్టు మెంటులో జీవితం ప్రారంభించి కొన్ని సంవత్సరాలకే రెవిన్యూ ఇనస్పెక్టరు అయ్యాడు. అతడు రాజవరంలో పని చేస్తున్నాడు. అతడికి అక్కడ తాసిలు దారుగ శ్రీరామ్ ఉండేవాడు. అతడి దగ్గరనుండే శ్రీనివాసరావు ఎడ్మినిస్ట్రే షను నేర్చుకున్నాడు.

ఆ రోజులలో రేషనింగ్ ఉండేది. మార్కెట్‌లో ఎక్కడా బియ్యంలేవు. రాజవరం ప్రజలందరూ గుంపుగా తాలూకా ఆఫీసుకు వచ్చారు. శ్రీరామ్‌ను కలుసుకున్నారు. విషయం చెప్పుకు న్నారు. బియ్యం బజారులో దొరకక పోతే వాళ్ళ ప్రాణాలు పోతాయి అన్నారు.

'రేపు ఉదయం పదిగంటలకు మీకు బియ్యం బజారులో దొరుకుతాయి. మీరు వెళ్ళండి' అన్నాడు శ్రీరామ్. అప్పుడు శ్రీనివాసరావు అక్కడే ఉన్నాడు. బియ్యం ఎలా దొరుకుతాయో అతడికి అర్థంకాలేదు.

జనం అంతా అక్కడినుంచి వెళ్ళి పోయారు. తరువాత కొన్ని గంటల లోనే హోల్‌సేల్ బియ్యం వ్యాపారు లను తాలూకా ఆఫీసుకు పిలిపించాడు శ్రీరామ్. మీటింగు పెట్టాడు.

'రేపు ఉదయం ఎనిమిది గంటలకు మీరు ఒక్కొక్కరే ఎంత బియ్యం ఇస్తారో చెప్పాలి' అన్నాడు శ్రీరామ్.

'సరే' అంటూ వ్యాపారులందరూ వెళ్ళిపోయారు. వాళ్ళందరూ మీటింగు పెట్టుకున్నారు. ఆలోచించుకున్నారు. శ్రీరామ్ చెప్పినట్లు చేయకుండా ఉండ డానికి నిశ్చయించుకున్నారు.

మరునాడు ఉదయం ఎనిమిది గంటల వరకు చూచాడు శ్రీరామ్. అతడు పరిస్థితి ముందే ఊహించుకున్నాడు. వెంటనే

సర్కిల్ ఇనస్పెక్టరును తీసుకొని వెళ్ళి రైస్ గోడౌన్స్ అన్నీ తాళం వేయించే శాడు.

వ్యాపారులందరికీ మతిపోయింది. కాళ్ళ బేరానికి వచ్చారు.

కాని శ్రీరామ్ ఆ బియ్యంమార్కెట్‌లో కంట్రోలు ధరకు అమ్మించాడు. ప్రజ లందరూ అతడిని ఎంతో పొగిడారు. అలాంటి అధికారులు దేశానికి కావాలి అన్నారు.

మరొకసారి శ్రీరామ్ ఏదో ఫండ్ కలెక్ట్ చేయవలసి వచ్చింది. పెదపట్నం వెళ్ళాడు. గ్రామస్తులను విరాళాలు ఇవ్వ మన్నాడు. అందరూ సరే అన్నారు.

అతడు తిరిగి వచ్చేశాడు. కాని గ్రామ స్థులు విరాళాలు ఇవ్వమని శ్రీనివాస రావుకు చెప్పారు. ఆ విషయం అతడు శ్రీరామ్‌కు చెప్పాడు.

'కారణం తెలుసుకున్నావా వాళ్ళు ఇవ్వననటానికి?' ప్రశ్నించాడు శ్రీరామ్.

'ఆ ఊళ్ళో అప్పారావు, వెంక ట్రావు కారణం. వాళ్ళు ఏదో పార్టీ భేదాలు పెట్టారు. వాళ్ళే దానికి కారణం' అన్నాడు శ్రీనివాసరావు.

'వాళ్ళిద్దరూ ఏదో అతి వాదులనినాకు రిపోర్టు వచ్చింది. వాళ్ళే నన్నమాట.'

వెంటనే శ్రీరామ్ పోలీస్ సూపరిం టెండెంటుకు వ్రాశాడు, వాళ్ళని వెంటనే అరెస్టు చేయమని గట్టిగ వ్రాశాడు.

శ్రీరామ్ అంటే పై అధికారులకు గౌరవం. దానికి కారణం అతడి ప్రతిభ, నిజాయితీ.

వెంటనే అప్పారావుకు, వెంక ట్రావుకు అరెస్టు వారెంట్లు జారీచేయ బడ్డాయి. వాళ్ళు దానిని తప్పించుకుని తిరుగుతున్నారు. పోలీసు సూపరెంటుని కలుసుకుంటే అతడు ఏమీ చేయలేనని చెప్పాడు. శ్రీరామ్ దగ్గరకే వెళ్ళ మన్నాడు.

పెదపట్నం పెద్దలు శ్రీరామ్ దగ్గ రకు వచ్చారు. అతడిని వేడుకున్నారు.

'వాళ్ళిద్దరిచేత ఊళ్ళోవాళ్ళకు మళ్ళీ చెప్పించండి. నాకు ఇస్తానన్న విరాళాలు తీసికొనివచ్చి ఇవ్వండి. వారంట్లు ఉప సంహరించుకోవడం జరుగుతుంది' అన్నాడు శ్రీరామ్.

శ్రీరామ్ చెప్పినట్లు చేసి ఆ పెద్దలు ఆ చిక్కులోంచి బయటపడ్డారు. శ్రీని వాసరావు ఈ విషయాలన్నీ అతడి కళ్ళతో అతడే చూచాడు. అతడూ శ్రీరామ్‌లా ప్రతిభ సంపాదించాడు. నిజాయితీగా బ్రతుకుతున్నాడు.

శ్రీనివాసరావు జీవితం పిట్టని కొట్టి పొయ్యిలో పెట్ట అయింది. దానికి అతడు విచారించలేదు.

అతడు రాజమండ్రి తాసిలుదారుగా వచ్చాడు. అతడూ అందరిలాంటివాడే ననుకున్నారు అందరూ అక్కడ.

గణపతి అక్కడ పెద్ద బురకా రాయుడు. రాజమండ్రీలో కూర్చుని

ఫోనులమీద ఏపనైనా చేయించగలడు. అతడి పలుకుబడి రాజకీయాలలో అందరకూ అక్కడ తెలుసు.

అతడికి రైస్‌మిల్లు, పెద్ద హోల్ సేల్ వ్యాపారం ఉన్నాయి. అతడు బాగుపడిందంతా స్వాతంత్ర్యము వచ్చిన తరువాతే. చిన్న వ్యాపారస్తుడు గణపతి మిల్లు యజమాని, రాజకీయ నాయకుడు అక్కడివాళ్ళ కళ్ళ ముందే అయిపోయాడు.

శ్రీనివాసరావుకు అతడి విషయం తెలిసింది. అతడి జోలికిపోవడం అంత మంచిది కాదనికూడా విన్నాడు. కాని అతడు అలాంటివాటికి బెదిరిపోయే వాడు కాడు. ఒకరోజు ఉదయం అతడి మిల్లు తనిఖీ చేయడానికి వెళ్ళాడు శ్రీనివాసరావు.

'తాసిలుదారుగారు అనుకోకుండా ఇలా వచ్చారు' అంటూ గణపతి అతడిని ఆహ్వానించి గౌరవించాడు.

'మీ మిల్లు తనిఖీ చేయటానికి వచ్చాను' అన్నాడు శ్రీనివాసరావు.

'మా మిల్లా. ఇదివరకు ఎవ్వరూ ఇలా రాలేదే. మీరే తనిఖీ అంటూ వచ్చారు' అంటూ గణపతి కంటితో మిల్లు మేనేజరుతో మాట్లాడాడు.

'నేను చేయకూడదా ?'

'మీ ఇష్టం. కాని నా మిల్లు తనిఖీ చేయవక్కరలేదు. అన్నీ సరిగానే ఉంటాయి. ఆలోచించుకోండి. కాదంటే సరే రండి వెళ్దాము.'


'నడవండి' అన్నాడు శ్రీనివాసరావు.

గణపతి గోడౌనులోకి వెళ్ళాడు శ్రీనివాసరావు. అందులో వున్నదంతా దాచి ఉంచిన నల్లబజారు ధాన్యం. శ్రీనివాసరావు దొంగ దొరికాడు అనుకున్నాడు.

శ్రీనివాసరావు అతడి ప్యూనును పిలిచాడు. ఎక్కడా జవాబు రాలేదు. ఎంత గట్టిగా అరచినా ఎవరూ పలకడంలేదు. గణపతి ఎక్కడా కనిపించడంలేదు. అతడికి మతిపోయింది. భయం వేసింది. ఆ గోడౌనులో అతను చావవలసిందే. ఆ ఆలోచన రాగానే అతడి ప్రాణాలు పైకి పోయాయి. అతడి సంసారం శారద సంసారం గుర్తుకు వచ్చింది. రెండు సంసారాల పనీ అధోగతి అయినట్లే. అప్పుడే అతడి ప్రాణాలు పోతూన్నట్లు అనిపించింది. కాలు కాలిన పిల్లిలా నాలుగువైపులకు నడిచాడు. నీరసం వచ్చింది. ఒకచోట కూలబడ్డాడు.

ఎంత టైము అతడు అలా ఉన్నాడో శ్రీనివాసరావుకు తెలీదు. అప్పుడు ఏవో మాటలు వినిపించసాగాయి. బ్రతుకు జీవుడా అనుకున్నాడు శ్రీనివాసరావు.

సర్కిలు ఇనస్పెక్టరు సూర్యారావు ఒక సబ్ ఇనస్పెక్టరుతో వచ్చాడు. వాళ్ళు శ్రీనివాసరావును లోపల చూచి




అదిరిపడ్డారు. సంగతి అర్థంచేసుకున్నారు.

'మీకు ఫోన్ చేసి నేను వచ్చాను కనుక ఈ రోజు ప్రాణాలతో బయట పడ్డాను' అన్నాడు శ్రీనివాసరావు.

'నాకు అనుమానం వచ్చే గోడౌన్ లోకి వచ్చాను. నేను ఊహించినంత పనీ జరిగింది' అన్నాడు సర్కిల్ ఇనస్పెక్టరు.

'నడవండి బయటకు. గోడవును సీలు చేయించండి' అన్నాడు శ్రీనివాసరావు.

గణపతి గోడవున్‌కు తాళం వేయబడింది. అతడు వాళ్ళందరి ముందు నేరస్తుడులా నిలబడ్డాడు. గణపతిని సరుకులు దాచియుంచిన నేరంక్రింద అరెస్టు చేశారు. తరువాత అతడు జామీనుమీద బయటకు వచ్చాడు.

వారం రోజులు తిరగకుండానే శ్రీనివాసరావును శంకరగిరిమాన్యం పట్టించారు. ఎందుకూ పనికిరాని చోటికి అతడిని ట్రాన్స్‌ఫరు చేశారు.

శ్రీనివాసరావుకు జ్ఞానోదయం అయింది. న్యాయానికి, నిజాయితీకి స్థానం దేశంలో లేదని తేలిపోయింది. రాజకీయాలలో పలుకుబడి ఉన్నవాళ్ళకి, లంచగొండులకి, అవినీతిపరులకు, స్వార్థపరులకు రోజులు. మంచివాళ్ళకు చోటులేదు.

బ్రిటిషువాళ్ళు రెండువందల ఏళ్ళు రాజ్యంచేసినా వాళ్ళ దగ్గరనుండి నేర్చుకున్నది ఏమీలేదు. వాళ్ళ పరిపాలనా విధానం, వాళ్ళ నడవడిక అబ్బలేదు.

శ్రీనివాసరావుకి మనుషుల పైన దేశంపైన నమ్మకం పోయింది. ధర్మానికి విలువనివ్వని దేశం పైకి రాలేదు అనుకున్నాడు. అతడి మనోస్థైర్యానికి మొదటి దెబ్బ తగిలింది. అతడిలో అప్పటివరకు వున్న బిగువులేదు. ధైర్యంలేదు.

మరో జన్మ ఎత్తినట్లు భావించాడు శ్రీనివాసరావు.

* * *

'నీ ఋణం ఈ జన్మలో నేను తీర్చు కోలేను అన్నయ్యా' అంది శారద.

శారద కొడుకు కృష్ణారావు బి.ఎ. ప్యాసయ్యాడు. అతడి చదువు అంతా శ్రీనివాసరావే చెప్పించాడు.

ఆమె కూతురు లక్ష్మీకుమారికి కూడా అతడే చదువు చెప్పించాడు. పదవ తరగతి ఆమె పూర్తి చేసింది.

అప్పుడు శ్రీనివాసరావు ఆమెకు పెళ్ళిచేశాడు. మంచి సంబంధమే చేశాడని చెప్పాలి. బి.ఏ.,బి.ఇడీ. పాసయిన స్కూలు టీచరుకు ఇచ్చి పెళ్ళి బాగా చేశాడు. ఆమె సుఖంగా కాలం గడుపుతోంది.

ఇక శారద కొడుకు కృష్ణ మిగిలాడు. కృష్ణకు తండ్రి కంపెనీలో గుమాస్తా ఉద్యోగం దొరికింది. ఆ ఉద్యోగంరావటానికి కారణంకూడా శ్రీనివాసరావే.

ఇక శారద అన్నదగ్గర ఉండవలసిన అవసరంలేదు. కొడుకుతో కలిసి బయలుదేరింది. ఆమె శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు వెల్లడిచేస్తున్నట్లుంది.

'నేను నీకు ఏమీ చేయలేదు శారదా. నాతోపాటు మీరు ఉన్నారు. బుద్ధిగా నీ కొడుకు చదువుకున్నాడు. ఉద్యోగం తెచ్చుకున్నాడు. అంతా నీదే అదృష్టం. నీ కొడుకుతో సుఖంగా కాలక్షేపంచెయ్యి' అన్నాడు శ్రీనివాసరావు.

'నీ వల్లే ఈ రోజు నేనూ నా పిల్లలూ ఇలా ఉన్నాము దానికి కారణం నీవే. నీ మేలు ఈ జన్మకి మరచిపోను.'

'అన్నకు చెల్లెలుకు మధ్య మంచితనం ఏమిటి! అందరం ఒక్కటే. అందరి సుఖం ఒక్కటే. నీవు సుఖంగా ఉంటేనే నాకు సుఖం' అన్నాడు శ్రీనివాసరావు.


శ్రీనివాసరావు శారదను, కృష్ణను పంపించాడు. అతడి బాధ్యత అతడు నిర్వర్తించినట్లు ఆనందించాడు.

అప్పటికి అతని పెద్ద కొడుకు శంకరం యం.ఏ. పాసయ్యాడు. కాలేజి లెక్చరర్ అయ్యాడు. ఇంకా ఇద్దరు మగపిల్లలు కాలేజి చదువులలోనే ఉన్నారు. బాధ్యతలు పూర్తిగా వదలాలంటే ఇంకా అయిదారేళ్ళు పడుతుంది. అతడి సర్వీసుకూడా ఇంచుమించుగా అంతే ఉంది.

కాని శ్రీనివాసరావుకు ఉద్యోగం చేయటం కష్టంగానే ఉంది. అన్నివైపుల నుండీ ప్రెషర్సు వస్తూనే ఉన్నాయి.

ఎవరో వచ్చి ఏదో చేయమంటారు. అది తప్పుడు పని. చేయకపోతే చిక్కు. చేస్తే అతడు ఆత్మవంచన చేసుకున్నట్లు అనుకుంటాడు.

స్వరాజ్యం వచ్చిన తరువాత ఎడ్మినిస్ట్రేషను అధోగతి పాలయింది. నిజా



యితీగా ఒక ఆఫీసరు ఉండటం కష్టం. అతడు రెవెన్యూ ఇనస్పెక్టరుగ సుఖంగా ఉండేవాడు. తాసిల్దారుగ అతడికి సుఖం లేదు. మంచి చెడుగ, చెడు మంచిగ మారి పోయాయి. ఈ అధ్వాన్న పరిస్థితి చూచి అతడు క్రుంగిపోయాడు.

ఆ ఆలోచనలతో శ్రీనివాసరావు ఆరోగ్యం దెబ్బతింది. డయాబిటీస్, బ్లడ్ ప్రెషర్ ప్రారంభం అయ్యాయి. అతడి పరిస్థితి అతడికే ఆందోళన కలిగించింది.

రోజురోజుకీ అతడి ఆరోగ్యం చెడుతోన్నట్లుంది. అతడికి ఇక అట్టే కాలం బ్రతకనేమో అన్న భయం వేసింది. పెద్దకొడుకును సెలవుపెట్టించి తనదగ్గర ఉంచుకున్నాడు.

'శంకరం! శారదకు నా పరిస్థితి వ్రాసి ఒక్కసారి వచ్చి చూచి వెళ్ళమను. నాకు దానిని చూడాలని ఉందిరా' అన్నాడు శ్రీనివాసరావు.

'అలాగే వ్రాస్తాను నాన్నా. వెంటనే రమ్మని వ్రాస్తాను' అన్నాడు శంకరం.

ఉత్తరం వ్రాసిన వారంరోజులకైనా శారద రాలేదు. కనీసం ఉత్తరం అయినా రాలేదు. శ్రీనివాసరావుకు ఆశ్చర్యం కలిగింది. కబురు తెలియగానే రెక్కలు కట్టుకు వాల్తుంది అనుకున్నాడు అతడు.

'శారద దగ్గరనుండి ఏమీ జవాబు రాలేదా? నాకేదో భయంగా ఉంది. ఆమె ఎలా ఉందో' అంటూ శ్రీనివాసరావు ఆమె రాకపోవడానికి కారణం ఏదో ఊహించుకోసాగాడు.

అలా శ్రీనివాసరావు రోజులు లెక్క పెట్టుకుంటూండగా ఒక రోజు శారద దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. శంకరం ఉత్తరంతీసి చదవడం ప్రారంభించాడు.

"మహారాజశ్రీ అన్నయ్యకు నీచెల్లెలు శారద నమస్కరించి వ్రాయునది :

నీకు ఆరోగ్యం బాగాలేనట్లు వ్రాసినావు. నా ఆరోగ్యమూ అంతంత మాత్రముగనే ఉంటోంది. అందుకే రాలేకపోయాను. ఈ ఉత్తరం అందుకే వ్రాస్తున్నాను.

మీ బావగారు పోయినప్పుడు కంపెనీ వాళ్ళు అయిదువేలు ఇచ్చారు. ఆ డబ్బు నీకు నేను ఇచ్చాను. అది నీకు గుర్తుండి ఉంటుంది.

నా అయిదువేలూ నాకు వెంటనే పంపుతావని ఆశిస్తున్నాను.

ఇట్లు
నీ చెల్లెలు
శారద"

ఆ ఉత్తరంలో విషయం వినేసరికి శ్రీనివాసరావుకు ప్రాణం అప్పుడే పోతూన్నట్లయింది. అతడి చెల్లెలు వ్రాసిన ఉత్తరమేనా అది అని అతడికి సంశయం వచ్చింది.

చితికిపోయిన సంసారాన్ని పైకి తీసికొచ్చి చెల్లెలుకు, పిల్లలకు మార్గం చూపించాడు. అతడు వాళ్ళ గురించి ఎంత డబ్బు ఖర్చుచేశాడో అతడికే తెలియదు.

అయిదు వేలతోటే శారద అవన్నీ అయ్యాయనుకుందా? వద్దంటూంటే అతడి చేతిలో పెట్టింది. అతడు మంచం పట్టి చూచి వెళ్ళమంటే కనీసం రానైనాలేదు. అయిదు వేలు పంపమని ఉత్తరం వ్రాసింది.

'శంకరం నీవు నాకో మాట ఇవ్వాలి. శారదకు ఒక్క చిల్లిగవ్వ ఇవ్వకూడదు. విశ్వాస ఘాతకురాలు' అన్నాడు శ్రీనివాసరావు.

'మీరు ఆవేశపడకండి' అన్నాడు శంకరం. 'అసలే మీకు బ్లడ్ ప్రెషరు'.

'లోకంలో ఏదీ లేదురా. డబ్బు. డబ్బు. అంతా డబ్బే. మనిషి ప్రేమా, అభిమానం అన్నీ పిచ్చి. అదేరా నేను జీవితంలో తెలుసుకున్నది. చెల్లెలు లేదు. అన్న లేడు. తల్లి లేదు. తండ్రీ లేడు. అందరూ డబ్బు చుట్టాలు. అంతా డబ్బే. పాడు ప్రపంచం'. అన్నాడు శ్రీనివాసరావు.

'మీరు ఊరుకోండి నాన్నగారూ' అన్నాడు శంకరం.

'అబ్బా గుండెల్లో పోటురా. అబ్బా ....అ....' అని శ్రీనివాసరావు అంటూంటే శంకరం కళ్ళల్లోంచి నీళ్ళు జలజలా అతడిపై పడ్డాయి.